సాక్షి సిద్దిపేట

శుక్రవారం । 22 । సెప్టెంబర్ । 2023



కళాఉత్సవ్.. కలర్ ఫుల్

వర్గల్ నవోదయ విద్యాలయంలో కళాఉత్సవ్ మహాసంబరంబం అట్టహాసంగా ప్రారంభమైంది. వివరాలు 8లో ▸



శాంతి భద్రతలకే ప్రాధాన్యం

శాంతి భద్రతలకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని డీఐజీ రమేష్‌నాయుడు అన్నారు. వివరాలు 8లో ▸



మురుగు.. పరుగు

హుస్నాబాద్ పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం మురికి నీటితో నిండిపోయింది. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

కురిసిన చిరుజల్లులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలో చిరుజల్లులు కురిశాయి. కొద్ది రోజులుగా వాతావరణం వేడిగా ఉండటంతో కురిసిన చిరుజల్లులతో ప్రజలు ఉపశమనం పొందారు. జిల్లా వ్యాప్తంగా గురువారం 15.5సగటు వర్షపాతం నమోదయ్యింది. అత్యధికంగా 64.2 మి.మీ, బెజ్జంకి మండలంలో 42.3మి.మీ, అక్బర్ పేట–భూంపల్లి మండలంలో 32.5 మి.మీ వర్షపాతం నమోదు అయ్యింది.

16 నుంచి ఓపెన్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఓపెన్ స్కూల్, ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు అక్టోబర్ 16 నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్టోబర్ 16 నుంచి 26 వరకు థియరీ, అక్టోబర్ 30 నుంచి నవంబర్ 6 వరకు ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు చేర్యాల విద్యార్థినులు

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్రస్థాయి యోగా పోటీలకు చేర్యాల మండలం ఆకునూరు ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ఐలయ్య, చైర్మన్ దాసు తెలిపారు. శిరీష, అమూల్య 9వ తరగతి విద్యార్థినులు. పిరమిడ్ సెంటర్, ఖడ్తాల్ హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో వీరు పాల్గొననున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వీరిని అభినందించారు.

అంగన్‌వాడీల డిమాండ్లు నెరవేర్చండి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి

సిద్దిపేటరూరల్: అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు తక్షణం నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడారు. అంగన్వాడీలతో ప్రభుత్వం అన్ని శాఖల్లోనూ పనులు చేయిస్తోందని, కానీ కనీస వేతనం అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. పైగా వేధింపులకు పాల్పడుతోందని మండిపడ్డారు. అంగన్వాడీలను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పెన్షన్, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాళ్ల బండి శశిధర్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కాముని గోపాలస్వామి, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పద్మ, ఎడ్ల లక్ష్మీ, కళావతి, అంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ బదిలీ



ప్రిన్సిపాల్ మార్కండేయులుకు జ్ఞాపికను అందజేస్తున్న విద్యార్థులు

సిద్దిపేటరూరల్: సిద్దిపేట కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ మార్కండేయులు బదిలీపై గోల్కొండ కేవీ నంబర్ 1 విద్యాలయానికి వెళ్లారు. ఈమేరకు గురువారం జిల్లా కలెక్టర్.. ప్రిన్సిపాల్‌ను రిలీవ్ చేశారు. దీంతో ప్రిన్సిపాల్‌కు వీడ్కోలు సమావేశం ఏర్పాటు జరిగింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రిన్సిపాల్ సేవలను కొనియాడారు. అనంతరం విద్యార్థులు ప్రిన్సిపాల్‌కు జ్ఞాపికను అందజేశారు.

హర్యానా గవర్నర్ సంతాపం

మెదక్ కలెక్టరేట్: రామాయంపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి (ఆర్ఎస్ వాసురెడ్డి) మృతిపై హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ గురువారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. వాసురెడ్డి స్వగ్రామం చేగుంట మండలం పొలంపల్లిలో గురువారం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన మృతిపై గవర్నర్ దత్తాత్రేయ మాట్లాడుతూ.. సామాన్య కుటుంబం నుంచి శాసన సభ్యుడిగా వాసురెడ్డి ఎదిగారని, రామాయంపేట, ఉమ్మడి మెదక్ జిల్లాల సమస్యలపై పోరాటం చేశారని గుర్తుచేశారు. నమ్మిన సిద్ధాంతంతో, అంకిత భావంతో ప్రజా సేవ చేశారని కొనియాడారు.



సిద్దిపేటజోన్: పట్టణంలోని శ్రీరెసిడెన్సీ మండప వినాయకుడికి భక్తులు సమర్పించిన మహా నైవేద్యం



దుబ్బాకలో పూజలు..

బొజ్జ గణపయ్య.. నైవేద్యం స్వీకరించవయ్యా


గణేశ్ నవరాత్రి వేడుకలు జిల్లాలో వైభవంగా కొనసాగుతున్నాయి. మండపాల్లోని వినాయక విగ్రహాలకు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పలు చోట్ల అన్నదానాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుంటున్నారు. మరోవైపు పలు చోట్ల ప్రతిష్ఠించిన విగ్రహాలను నిమజ్జనాలకు తరలించారు. సిద్దిపేట పట్టణంలోని శ్రీరెసిడెన్సీ మండప వినాయక విగ్రహానికి భక్తులు మహా నైవేద్యం సమర్పించారు.

సెల్ఫీ విత్ గణేశ్

మీరు విఘ్నేశ్వరుడిని ప్రత్యేక ఆకృతుల్లో ప్రతిష్ఠించారా.. పర్యావరణాన్ని కాపాడే రీతిలో గానీ, ఏ అంశంపైనైనా సమాజానికి సందేశం ఇచ్చే రీతిలో మీ వినాయకుడు ఉన్నాడా.. మీ కాలనీల్లో, అపార్ట్‌మెంట్‌లలో ఏర్పాటు చేసుకున్న వినాయకుడు ఏదైనా స్పెషల్ గెటప్‌లో ఉన్నాడా.. అయితే, మీ వినాయకుడితో మీరు సెల్ఫీ తీసుకుని మాకు పంపితే.. ఆ ఫొటోలలో ఎంపిక చేసి ప్రచురిస్తాం.

మీరు సెల్ఫీ పంపాల్సిన వాట్సప్ నం.

98668 98692






మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

బహిరంగ ప్రదేశాల్లో దూషిస్తే కేసులే

- పకడ్బందీగా అట్రాసిటీ యాక్ట్ అమలు
- కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్
- కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశం
- పాల్గొన్న సీపీ, నాయకులు

సిద్దిపేటరూరల్: ఎస్సీ, ఎస్టీలను బహిరంగ ప్రదేశాల్లో కులంపేరుతో దూషిస్తే, అవమానిస్తే, అట్రాసిటీ యాక్ట్ ప్రకారం శిక్షార్హులవుతారని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై పోలీస్, న్యాయ, దళిత సంఘాల నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలను బహిరంగ ప్రదేశాల్లో దూషిస్తే అట్రాసిటీ చట్టం వర్తిస్తుందని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలియజేసిందన్నారు. ఇలాంటి చర్యలను రూపుమాపేందుకు గ్రామాల్లోనే సమావేశాలు నిర్వహించాలని సూచించారు. దళిత వాడల్లో కాకుండా గ్రామ పంచాయతీల్లో నిర్వహించాలన్నారు. బాధితులకు అందాల్సిన నష్ట పరిహారాలను త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ శ్వేత, మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలను ఎవరైనా అవమానపరిస్తే వెంటనే దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేయాలన్నారు. సరైన న్యాయం జరగకపోతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎమ్మెల్యే రఘునందన్ రావు, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవోలు బన్సీలాల్, బెన్ షాలం, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ఎస్సీ వెల్ఫేర్ అధికారి కవిత, ఏసీపీలు సురేందర్ రెడ్డి, రమేష్, సతీష్, వివిధ దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఏడు దశాబ్దాల్లో.. ఒక్కరే!



గజ్వేల్ నుంచి రెండు మార్లు ఎమ్మెల్యేగా గీతారెడ్డి

- జిల్లా నుంచి చట్ట సభల్లో అతివల ప్రాతినిధ్యం తక్కువే
- 33 శాతం రిజర్వేషన్ అమల్లోకి వస్తే పెరగనున్న అవకాశాలు
- జిల్లాలో మహిళా ఓటర్లు అధికం



అన్నింటా సగం.. అంటూ మహిళలను కీర్తిస్తున్నా.. వారికి జిల్లా నుంచి చట్టసభల్లో సభ్యులుగా పొందిన అవకాశాలు తక్కువే. ఏడు దశాబ్దాల్లో జిల్లా నుంచి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించింది ఒక్కరే.. స్థానిక సంస్థల్లో కల్పించిన రిజర్వేషన్ల ద్వారా మహిళలు ప్రజా ప్రతినిధులుగా ఎన్నికై తమదైన శైలీలో సత్తా చాటుతున్నారు. శాసన సభ, లోక్‌సభలకు వెళ్లే అవకాశాలూ దక్కడం లేదు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేస్తే ఇక చట్ట సభల్లో సైతం మహిళల ప్రాతినిధ్యం పెరగనుంది.

సాక్షి, సిద్దిపేట: జిల్లా నుంచి 70 ఏళ్లలో అసెంబ్లీకి ఒక్క మహిళనే ప్రాతినిధ్యం వహించారు. సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రాలుండగా జనగామ నియోజకవర్గం నాలుగు మండలాలు, మానకొండూరు నియోజకవర్గంలోని బెజ్జంకి మండలం ఉన్నాయి. గజ్వేల్ నుంచి 2004, 1989లలో డాక్టర్ గీతారెడ్డి ఎమ్మెల్యేగా చేశారు. గజ్వేల్ నియోజకవర్గం 1989లో సంజీవరావు (టీడీపీ) అభ్యర్థిపై గీతారెడ్డి(కాంగ్రెస్), 2004లో దుర్గయ్య(టీడీపీ)పై గీతారెడ్డి(కాంగ్రెస్) గెలుపొందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1989–1994 వరకు సాంఘిక సంక్షేమ, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రిగా, 2004–2009 వరకు పరిశ్రమల శాఖ మంత్రిగా పని చేశారు. పలు నియోజక వర్గాల నుంచి ఎమ్మెల్యే అభ్యర్థులుగా మహిళలు పోటీ చేసినప్పటికీ ఓటమి చెందారు. త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల కోసం బీఆర్ఎస్ పార్టీ ప్రకటించిన జాబితాలో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో మహిళలకు అవకాశం ఇవ్వలేదు. మిగతా పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. చట్ట సభల్లో సైతం రిజర్వేషన్లు అమలైతే దేశాభివృద్ధిలో వారి పాత్ర మరింత పెరిగే అవకాశం ఉంది.

మహిళా ఓటర్లు అధికం

జిల్లా వ్యాప్తంగా మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్, గజ్వేల్ నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. ఆగస్టులో విడుదల చేసిన ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 9,03,793 ఓటర్లుండగా అందులో మహిళలు 4,56,238, పురుషులు 4,48,532, ఇతరులు 23 మంది ఓటర్లు ఉన్నారు. అక్టోబర్ 4న వెలువడే తుది జాబితాలో ఏ నియోజకవర్గంలో మహిళల సంఖ్య ఎంత అన్నది తేలనుంది.

స్థానిక సంస్థల్లో ..

స్థానిక సంస్థల్లో 50శాతం రిజర్వేషన్ మహిళలకు కల్పించడంతో చాలా మందికి పదవులు దక్కాయి. గ్రామ సర్పంచ్ నుంచి మొదలుకొంటే జెడ్పీ చైర్‌పర్సన్‌ల వరకు, మున్సిపాలిటీల్లో సైతం సగం చోట్ల మహిళలకు కౌన్సిలర్లుగా అవకాశం వచ్చింది. జెడ్పీ చైర్‌పర్సన్‌గా రోజా శర్మ, సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కడవేర్గు మంజుల, దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత, హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, చేర్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూప లకు రిజర్వేషన్లలో పదవులు లభించాయి. అలాగే 16 మండలాల్లో ఎంపీపీలు, జెడ్పీటీసీలు 12, ఎంపీటీసీలు 104, సర్పంచ్‌లు 264 మందికి అవకాశం లభించింది.

ప్రయివేట్ టీచర్లకు ఉచిత వైద్య పరీక్షలు

సిద్దిపేటజోన్: జిల్లాలోని ప్రయివేట్ విద్యాసంస్థలలో పనిచేసే టీచర్ల పట్ల మంత్రి హరీశ్‌రావు ఉదారత్వం చాటారు. వారికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించడమేకాక, హెల్త్ ప్రొఫైల్ తయారీ చేయనున్నారు. ఇటీవల ఇచ్చిన హామీ మేరకు గురువారం క్యాంపు కార్యాలయంలో మంత్రి ఓఎస్డీ బాలరాజు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్ అధ్యక్షతన జిల్లా వైద్యాధికారి కాశినాథ్, ప్రయివేట్ విద్యాసంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రయివేట్ విద్యాసంస్థలలో పనిచేసే టీచర్లకు, వారి కుటుంబ సభ్యులకు కూడా పరీక్షలు నిర్వహించనున్నారు. ఈనెల 23న హుస్నాబాద్ డివిజన్ కోసం (కేరళ స్కూల్), 24న సిద్దిపేట డివిజన్ (అంబిటాస్ స్కూల్), 28న దుబ్బాక డివిజన్ కోసం మిరుదొడ్డి (బ్ల్యూమింగ్ బర్డ్స్),30 న చేర్యాల డివిజన్ కోసం (వికాస్ గ్రామర్ స్కూల్), అక్టోబర్1న గజ్వేల్ డివిజన్ కోసం (జీడీఆర్ స్కూల్)లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆరోగ్య సమస్యలున్న వారికి సిద్దిపేట లోని మెరిడియన్ స్కూల్ లో అక్టోబర్ 13న ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేసి వైద్యసేవలు అందించనున్నారు. సమావేశంలో విద్యాసంస్థల ప్రతినిధులు సోమేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజు, మోహన్ కుమార్, రవి, భాస్కర్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాకలో బీజేపీదే గెలుపు

- ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: దుబ్బాకలో భారీ మెజార్టీతో బీజేపీ గెలుపు ఖాయమని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. గురువారం దుబ్బాక పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో రుద్రారం గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు బీజేపీ లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు దుబ్బాక నియోజకవర్గం ప్రజలు చైతన్యవంతులని అన్ని ఆలోచించే ప్రజల కోసం పాటుపడే వారినే గెలిపిస్తారన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ కుటుంబ పాలనకు బుద్ది చెప్పే రోజులు దగ్గరపడ్డాయన్నారు. ప్రజల కోసం పనిచేసే వారికి అండగా ఉంటారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు భిక్షపతి, నవీన్ రావు, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీలో చేరిన వివిధ పార్టీల నాయకులు

మహిళా రిజర్వేషన్ బిల్లు సవరించాల్సిందే

- డీఎస్పీ నాయకులు రవిబాబు

సిద్దిపేటకమాన్: మహిళా రిజర్వేషన్ బిల్లు అగ్రవర్ణాలకు అనుకూలంగా ఉందని, ఈ బిల్లును సవరించాలని ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) జిల్లా అధ్యక్షుడు రవిబాబు డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా సిద్దిపేట అంబేడ్కర్ చౌరస్తాలో గురువారం బీజేపీ, మద్దతు తెలిపిన ఇండియా కూటమి పార్టీల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ బిల్లు ద్వారా మళ్లీ అగ్రవర్ణ మహిళలే పార్లమెంట్, అసెంబ్లీలోకి ప్రవేశిస్తారన్నారు. ఈ బిల్లును ధర్మ సమాజ్ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తోందన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న డీఎస్పీ నాయకులు

ఈసారి సబ్సిడీ లేనట్టేనా?

- శనగ సాగు భారమే!
- నాలుగేళ్లుగా ఇదే దుస్థితి
- యాసంగి ఆశలపై నీళ్లు
- జిల్లాలో సాగు కీలకం
- త్వరలో ప్రారంభంకానున్న సీజన్

గజ్వేల్ : శనగ విత్తు సబ్సిడీ ఈసారీ లేనట్టే కనిపిస్తోంది. పక్షం రోజుల్లో సీజన్ ప్రారంభం కానుండగా ఇప్పటి వరకు ఎలాంటి కదలిక లేదు. వానాకాలం సాగులో పంట నష్టానికి గురై యాసంగిలోనైనా ఊరట పొందాలనుకున్న రైతుల ఆశలు అడియాశలే కానున్నాయి. జిల్లాలో ఏటా యాసంగి సీజన్‌కు సంబంధించి ప్రధాన పంట అయిన శనగ విత్తుపై నాలుగేళ్లుగా సబ్సిడీ ఎత్తేయడంతో సాగు భారంగా మారింది.

20వేల క్వింటాళ్ల విత్తు అవసరం

యాసంగి సీజన్‌కు సంబంధించి జిల్లాలో సుమారు 30వేల ఎకరాల వరకు శనగ పంట సాగులోకి వచ్చే అవకాశముంది. ఇందుకోసం 20వేల క్వింటాళ్లకు పైగా విత్తనాలు అవసరం. మొక్కజొన్న 30వేల ఎకరాల వరకు సాగులోకి వచ్చే అవకాశం ఉండగా.. 4వేల క్వింటాళ్ల విత్తనం, పొద్దు తిరుగుడు 3,500 ఎకరాల్లో సాగులోకి వచ్చే అవకాశముండగా 550 క్వింటాళ్ల విత్తనం, వేరుశనగ 4వేల ఎకరాల్లో సాగులోకి వచ్చే అవకాశం ఉంది. దీంతో 600 క్వింటాళ్ల విత్తనం అవసరం ఉంటుంది. ప్రస్తుతం సబ్సిడీ శనగ విత్తనాల పంపిణీ వ్యవహారం చర్చనీయంశంగా మారుతోంది. నాలుగేళ్ల క్రితం శనగల



అసలు ధర రూ. 6,500గా నిర్ధారించి అందులో 35శాతం సబ్సిడీ మినహాయిస్తే రైతులు క్వింటాలుకు రూ.4,225కు అందించారు. దీని ప్రకారం కిలోకు రూ. 42.25పైసలు ధర చెల్లించారు. కానీ ఈసారి పరిస్థితి భిన్నంగా ఉండడంతో నిరాశ చెందుతున్నారు. ఇప్పటివరకు సబ్సిడీపై ఎలాంటి ప్రకటన రాలేదంటే ఇక పంపిణీ లేదనే విషయం స్పష్టమవుతోంది. ఇతర పంటలతో పోలిస్తే ప్రస్తుత యాసంగి సీజన్‌కు శనగ పంటే అనుకూలమైనదిగా రైతులు భావిస్తున్నారు. వానాకాలం సీజన్‌లో అతి వృష్టి, అనావృష్టి వంటి భిన్నమైన పరిస్థితి కారణంగా పత్తి, మొక్కజొన్న పంటలకు నష్టం సంభవించింది.. ఈ కారణంగా పంటల్లో ఎదుగుదల లోపించి ఎక్కడికక్కడా తెగుళ్లు దాడి చేశాయి. ప్రస్తుతం ఈ పంటలను తొలగించి శనగ సాగుతో ఉపశమనం పొందాలనుకుంటున్నారు. ప్రధానంగా నల్ల రేగడి భూములు ఎక్కువగా ఉన్న గజ్వేల్‌తో పాటు దుబ్బాక డివిజన్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఈ పంటను భారీ ఎత్తున సాగుచేస్తారు. విత్తనాలు వేసే సమయంలో నల్లరేగడిలో కొద్దిపాటి తేమ ఉంటే చాలు మొలకెత్తే అవకాశముంటుంది. ఆ తర్వాత చలికాలంలో వచ్చే పొగ మంచుతో పంటకు మంచి దిగుబడి వచ్చే అవకాశముంటుంది. అందువల్లే రైతులు ఈ పంటకు మొగ్గు చూపుతున్నారు. ఈసారి అంచనాకు మించి శనగ పంట సాగులోకి వచ్చే అవకాశమున్నది. నాలుగేళ్లుగా సబ్సిడీ విత్తనాల పంపిణీని నిలిపివేయడంపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

సమాచారం లేదు



శనగ విత్తు సబ్సిడీపై ఎలాంటి సమాచారం లేదు. యాసంగి సీజన్‌లో శనగ పంట కీలకమే. జిల్లాలో నల్ల రేగడి భూముల్లో శనగ ఎక్కువగా సాగు చేస్తారు. రైతుల అవసరాల మేరకు సబ్సిడీతో ప్రమేయం లేకుండా తెలంగాణ సీడ్ కార్పొరేషన్ ద్వారా విత్తనాలు అందుబాటులో ఉంచుతాం.

– శివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి యోగాసన పోటీలకు ఎంపిక



యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): రాష్ట్రస్థాయి యోగాసన పోటీలకు మండలంలోని ఇటిక్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈనెల 2వ తేదీన సిద్దిపేట యోగాసన అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి యోగాసన పోటీల్లో వారు ప్రతిభ చాటారు. రేపటి నుంచి 24 వరకు హైదరాబాద్‌లోని కద్తాల్‌లో జరిగే రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో వీరు పాల్గొంటారని హెచ్‌ఎం మాధవరెడ్డి గురువారం తెలిపారు. ఈసందర్భంగా పీఈటీ రజిని, విద్యార్థినులను సర్పంచ్ చంద్రశేఖర్ అభినందించారు.

జాతీయ కబడ్డీ క్రీడోత్సవాలకు చౌటపల్లి యువకుడు



వంశీకృష్ణ

అక్కన్నపేట(హుస్నాబాద్): తమిళనాడులోని మదురైలో ఈనెల 25వ తేదీ నుంచి అక్టోబర్ 22 వరకు జరగనున్న జాతీయ యువ కబడ్డీ క్రీడోత్సవాలకు మండలంలోని చౌటపల్లికి చెందిన పులికాశి వంశీకృష్ణ ఎంపికయ్యాడు. రాష్ట్రం నుంచి వంశీకృష్ణ ఎంపిక కావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. చౌటపల్లి సర్పంచ్ గద్దల రమేష్, పలువురు క్రీడాకారులు అభినందించారు.

యువతి అదృశ్యం



శృతి (ఫైల్)

సిద్దిపేటఅర్బన్: కాలేజీకి వెళ్లిన విద్యార్థి అదృశ్యమైన ఘటనపై సిద్దిపేట త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో పరిధిలో చోటుచేసుకుంది. సీఐ భానుప్రకాష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేటలోని శాంతినగర్‌కు చెందిన శృతి (20) డిగ్రీ సెకండియర్ చదువుతోంది. రోజు మాదిరే బుధవారం కళాశాలకు వెళ్లిన యువతి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు అంతటా వెతికారు. ఎక్కడా ఆచూకి లభించకపోవడంతో తండ్రి భాస్కర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భర్త మందలించాడని భార్య ఆత్మహత్య

హవేళీఘణాపూర్(మెదక్): నల్లా నీటి కోసం గొడవ పడొద్దని భర్త మందలించడంతో భార్య మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మెదక్ మండలం రాజ్‌పల్లి గ్రామంలో గురువారం వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని రాజ్‌పల్లికి చెందిన ఎడ లక్ష్మి(45) బుధవారం ఉదయం ఇంటి పక్కన ఉన్న మోటార్ వద్దకు నీటి కోసం వెళ్లింది. ఈ క్రమంలో ఇరుగుపొరుగు మహిళలతో గొడవ పడింది. నీటి కోసం గొడవ వద్దని భర్త కిషన్, కుమారులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన లక్ష్మి మెదక్‌కు వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లింది. రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా.. గ్రామ శివారులోని ఎర్రకుంట వద్ద చెప్పులు లభించాయి. అనుమానం వచ్చి కుంటలో గాలించగా మృతదేహం లభించింది. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని మెదక్ ఆస్పత్రికి తరలించినట్లు రూరల్ ఎస్ఐ అమర్ తెలిపారు.

వ్యక్తి రిమాండ్

హవేళీఘణాపూర్(మెదక్): మండలంలోని గాజిరెడ్డిపల్లిలో అటవీ భూమిని కబ్జా చేసిన వ్యక్తికి మెదక్ జూనియర్ సివిల్ జడ్జి రిటాలాల్ చంద్ రిమాండ్ విధించినట్లు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ మనోజ్‌కుమార్ గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన సాప అంజయ్య అటవీ ప్రాంతంలోని ఎకరం భూమిని కబ్జా చేయడంతో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. విచారణ అనంతరం జడ్జి 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు.

కళాఉత్సవ్.. కలర్‌ఫుల్

- వర్గల్ నవోదయలో సంగీత, సాంస్కృతిక సంరంభం
- అలరించిన సంగీత కచేరీలు, ఆకట్టుకున్న నృత్యాలు



వేడుకలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఏసీ అభిజిత్ బెరా

వర్గల్(గజ్వేల్): వర్గల్ నవోదయ విద్యాలయ వేదికగా కళా ఉత్సవ్– 2023 మహా సంరంభం గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. బోనాలు, పోతరాజుల విన్యాసాలు, కోలాటాలు, డప్పు చప్పుల్లతో అతిథులకు విద్యార్థులు స్వాగతం పలికారు. రాష్ట్ర నలుమూలల నవోదయ విద్యాలయాల నుంచి తరలివచ్చిన బాల బాలికలతో పండుగ వాతావరణం నెలకొంది.

అతిథులకు సాదర స్వాగతం

క్లస్టర్ స్థాయి కళాఉత్సవ్‌కు ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ ఏసీ అభిజిత్ బెరా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారికి నవోదయ ప్రిన్సిపాల్ రాజేందర్ బృందం పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం వారు ఎంపీ హాల్ వేదిక వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి రెండు రోజుల మహా సమ్మేళనాన్ని ప్రారంభించారు.

వ్యక్తిత్వ వికాసానికి కళలు దోహదం: ఎమ్మెల్సీ శ్రీనివాస్

కళలు వ్యక్తిత్వ వికాసానికి, మానసికోల్లాసానికి దోహదపడతాయని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. కళాత్మకత జోడిస్తూ వివరించే అంశం మనసులో హత్తుకుపోతుందని, సులభంగా ప్రజల్లోకి చేరుతుందన్నారు. మనం చెప్పదలుచుకున్న విషయాన్ని పాట రూపంలో, కవిత ద్వారా, చిత్రం ద్వారా వివరిస్తే సమ్మోహన పరుస్తుందని వివరించారు. విద్యార్థులు చదువుతో పాటు కళల్లో రాణిస్తూ నవోదయకు వన్నె తేవాలని ఆకాంక్షించారు. 'నాగేటి సాల్లల్ల నా తెలంగాణ'..పాటతో మొదలైన దేశపతి ప్రసంగం 'సారే జహాసే అచ్చా' వరకు విద్యార్థుల్లో ఉత్తేజం నింపుతూ కొనసాగింది. అనంతరం ఏసీ అభిజిత్ బెరా మాట్లాడుతూ.. నవోదయన్స్‌ను చదువుతో పాటు ఆల్‌రౌండ్ డెవలప్‌మెంట్ లక్ష్యంగా విద్యాలయ సమితి అనేక కార్యక్రమాలు చేపడుతుందని వివరించారు.

పోటీలు ప్రారంభం

విద్యార్థుల కళాత్మక ప్రతిభను వెలికితీయడం లక్ష్యంగా తొలిరోజు గురువారం వోకల్ మ్యూజిక్, డ్రాయింగ్, బొమ్మల ఆకృతుల తయారీ తదితర పోటీలు కొనసాగాయి.



బొమ్మలను తీర్చిదిద్దుతున్న విద్యార్థులు



చిత్రలేఖనం పోటీలు



విద్యార్థినుల నృత్యం

ఉసురుతీసిన కుటుంబ సమస్యలు

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. ఏఎస్ఐ సురేందర్ రెడ్డి కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లా పెద్దపూరిపాడ మండలానికి చెందిన రావి దుర్గారామ్ బతుకుదెరువు కోసం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ ఓడీఎఫ్ కాలనీకి వచ్చి పాశమైలారం పారిశ్రామిక వాడలోని ఒక ప్రైవేట్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా కుటుంబ సమస్యలతో సతమతమవుతున్నాడు. మూడేళ్ల క్రితం భార్య వదిలి వెళ్లిపోయింది. దీంతో దుర్గారామ్ తీవ్ర మనస్తాపానికి గురై బుధవారం ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.

అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి

కొండపాక(గజ్వేల్): అనుమానాస్పద స్థితిలో బాలిక (14) మృతి చెందింది. ఈ ఘటన కుకునూరుపల్లి మండలం చిన్న కిష్టాపూర్‌లో గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. చిన్న కిష్టాపూర్‌కు చెందిన బాలిక బుధవారం నుంచి కనిపించడంలేదు. దీంతో తల్లిదండ్రులు అంతటా వెతికారు. ఎక్కడా ఆచూకి లభించకపోవడంతో కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ పుష్పరాజ్ ప్రాథమిక విచారణ చేపట్టారు. బొబ్బాయిపల్లికి వెళ్లేదారిలో ఉన్న కలకలమ్మ చెరువులో శవం ఉందన్న సమాచారం అందింది. దీంతో పోలీసులు బయటకు తీసి గమనించగా బాలిక శవంగా గుర్తించారు. తల్లిదండ్రులకు సమాచారం అందించి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ తెలిపారు.

కోతుల దాడి.. బాలుడికి గాయాలు



కోతుల దాడిలో గాయపడిన బాలుడు

గజ్వేల్‌రూరల్: కోతుల దాడిలో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. పట్టణంలోని 17వ వార్డు మురళీ కృష్ణాలయం సమీపంలో మహేందర్‌రెడ్డి, రేఖ దంపతుల కుమారుడు అర్జున్‌రెడ్డిపై గురువారం కోతులు దాడి చేశాయి. సాయంత్రం ట్యూషన్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో ఒక్కసారిగా దాడి చేయగా.. భయపడిన బాలుడు కేకలు వేయడంతో స్థానికులు కోతులను చెదరగొట్టారు. అర్జున్‌రెడ్డిని ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్య చికిత్స చేయించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి కాపాడాలని స్థానికులు కోరారు.

కడుపునొప్పి భరించలేక..

అల్లాదుర్గం(మెదక్): కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి వివరాల ప్రకారం.. మండలంలోని అప్పాజీపల్లికి చెందిన జ్ఞానమొల్ల లక్ష్మినారాయణ(23) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. బుధవారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిన లక్ష్మినారాయణ ఇంటికి తిరిగి రాలేదు. గ్రామ శివారులో చింత చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొని ఉన్నట్లు గుర్తించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఒకరిపై దాడి..

అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధి గడిపెద్దాపూర్ గ్రామంలో దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన అశోక్ ఈ నెల 19న ఇంట్లో భోజనం చేస్తుండగా అదే గ్రామానికి చెందిన ఎరుకల రాజు తాడు ఇవ్వమని అడిగాడు. ఈ విషయంపై ఇద్దరి మధ్య గొడవ జరగడంతో రాజు పక్కనే ఉన్న రాయితో అశోక్‌పై దాడి చేశాడు. ఈ ఘటనలో అశోక్ తలకు తీవ్ర గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కేసు నమోదు

వెల్దుర్తి(తూప్రాన్): రుణం ఇస్తామని ఫోన్ చేసి డబ్బులు దోచిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన వెల్దుర్తి మండలం మానెపల్లిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మదుసూధన్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని మానెపల్లికి చెందిన శేఖర్‌కు బ్యాంక్‌లోను ఇస్తామంటూ ఈ నెల 18న ఓ ఫోన్ వచ్చింది. అదే గ్రామానికి చెందిన వరుసకు బావమరిది అయ్యే నర్సింలు తాను లోన్ తీసుకుంటానంటూ ఫోన్‌లో వ్యక్తి సూచించిన విధంగా దశలవారీగా రూ.80 వేలు చెల్లించాడు. ఫోన్‌లో వ్యక్తి స్పందించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మిథాలీ అగర్వాల్‌కు చాణక్య అవార్డు

సంగారెడ్డి అర్బన్: హైదరాబాద్ ఐఐటీలోని పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ మిథాలీ అగర్వాల్‌కు చాణ్య అవార్డు వరించింది. ఈ మేరకు పబ్లిక్ రిలేషన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ద్వారా జ్యూరీ స్పెషల్ చాణక్య అవార్డు ఫర్ రిలేషన్స్ మేనేజ్‌మెంట్‌తో సత్కరించారు. న్యూఢిల్లీలోని సివిల్ సర్వీసెస్ ఆఫీసర్స్ ఇన్‌స్టిట్యూట్‌లో సెప్టెంబర్ 21న జరిగిన కార్యక్రమంలో పార్లమెంటరీ కమిటీ గౌరవాధ్యక్షుడు జుయల్ ఓరమ్ ఆమెకు అవార్డును అందజేశారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి



యాదయ్య

హత్నూర (సంగారెడ్డి): చేపల వేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడు నీటి ప్రమాదంలో మృతి చెందాడు. ఈ సంఘటన హత్నూర మండలం బ్రాహ్మణగూడలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ సుభాష్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బొట్ల యాదయ్య (60) మత్స్యకారుడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. చేపలు పట్టి విక్రయించడమే జీవనాధారంగా కులవృత్తిని కొనసాగిస్తున్నాడు .బుధవారం గ్రామ సమీపంలో ఉన్న అయ్యవారి చెరువులోకి చేపలు పట్టడానికి వెళ్లాడు. అక్కడ చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు నీట మునిగి మృత్యువాత పడ్డాడు. రాత్రికి యాదయ్య ఇంటికి తిరిగి రాకపోవడంతో కంగారుతో కుటుంబ సభ్యులు చెరువులో వెతకగా మృతదేహం లభించింది. ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు మృతుడి చిన్న కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సుభాష్ తెలిపారు.

కృషి ఉంటే కొలువు ఖాయం

- నిరూపించిన పేదింటి బిడ్డ
- చిన్నతనంలోనే తండ్రి చనిపోయినా..
- పట్టుదలతో ఉన్నత చదువులు చదివిన రేణుక
- మంత్రి హరీశ్‌రావు అభినందనలు

నంగునూరు (సిద్దిపేట): కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించింది మగ్దూమ్‌పూర్‌కు చెందిన బట్ట రేణుక. చిన్నతనంలోనే తండ్రి మరణించినా మదనపడకుండా కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచింది. గ్రామానికి చెందిన బట్ట అయిలయ్య, రాజవ్వల కుమార్తె రేణుక. మూడేళ్ల వయసులోనే తండ్రి మరణించారు. తల్లి బీడీలు చుడుతూ రేణుకను స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి వరకు చదివించింది. ఆ పరీక్షలో రేణుక 555 మార్కులు సాధించింది. దాంతో 2010లో బాసర ట్రిపుల్ ఐటీ సీటు లభించింది. అక్కడ మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సు పూర్తి చేసింది. అనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంటెక్ పూర్తి చేసిన రేణుక ఐఐటీ హైదరాబాద్‌లో పీహెచ్‌డీ చేస్తోంది. ఈ క్రమంలో గేట్ ప్రవేశ పరీక్షలో క్వాలీఫై అయింది. టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ వెలువడగా మంచి మార్కులు సాధించడంతో పాటు మహిళా విభాగంగా రాష్ట్ర స్థాయిలో నాలుగో ర్యాంక్ సాధించింది. దీంతో రేణుక ఇరిగేషన్ డిపార్టు మెంట్‌లో ఏఈఈ (అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్)గా ఉద్యోగం సాధించింది.

మంత్రి హరీశ్‌రావు అభినందనలు

ప్రభుత్వ పాఠశాలలో చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించడం రేణుక పట్టుదలకు నిదర్శనం. పేదరికం, తండ్రి చనిపోయిన బాధను మరిచిపోయి ఏదో సాధించాలనే తపనతోనే ఇంతటి స్థాయికి చేరుకుంది. నేటి తరానికి స్ఫూర్తిగా నిలిచిన రేణుకకు అభినందనలు.

పట్టుదలతో ఉద్యోగం సాధించా



చిన్నతనంలోనే తండ్రి చనిపోవడంతో కుటుంబ సభ్యుల సహకారంతో ఎంటెక్ పూర్తి చేశా. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో రెండేళ్ల బాబును చూసుకుంటూ భర్త సహకారంతో కష్టపడి చదవడంతో ఉద్యోగం లభించింది.

– రేణుక, మగ్దూంపూర్

శాంతి భద్రతలకే అధిక ప్రాధాన్యం

- సిద్దిపేట పోలీసుల పనితీరు భేష్
- డీఐజీ రమేష్‌నాయుడు



పోలీసు కమిషనర్ కార్యాలయంలో డీఐజీ రమేశ్‌నాయుడు, సీపీ శ్వేత, అధికారులు

సిద్దిపేటకమాన్: శాంతి భద్రతలకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని డీఐజీ (రాజన్న జోన్ నంబర్ 3) రమేష్‌నాయుడు అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీసు కమిషనర్ కార్యాలయాన్ని, ఏసీపీ కార్యాలయం, రూరల్, ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లను సీపీ శ్వేతతో కలిసి డీఐజీ రమేష్‌నాయుడు గురువారం సందర్శించారు. డీఐజీ పోలీసు గౌరవ వందనం స్వీకరించి కార్యాలయంలోని వివిధ విభాగాలను సందర్శించి జిల్లాలో నమోదవుతున్న కేసుల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలోని పలు విభాగాలను పరిశీలించారు. ఎస్కార్ట్, గార్డ్స్, వీఐపీ బందోబస్తు, తదితర అంశాల గురించి ఏఆర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల విషయంలో సిద్దిపేట పోలీసుల పనితీరు అమోఘమని అన్నారు. సమష్టిగా విధులు నిర్వహించినపుడు ఏదైనా సాధించవచ్చని, అంకిత భావంతో విధులు నిర్వహించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పోలీసు కమిషనర్ కార్యాలయం పచ్చదనం, పరిశుభ్రతతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్నందుకు, 5ఎస్ ఇంప్లిమెంటేషన్ బావుందని సీపీ శ్వేతను, పోలీసు అధికారులను అభినందించారు. సర్కిల్ కార్యాలయ ఆవరణలో మొక్కను నాటారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు అడ్మిన్ శ్రీనివాసరావు, లాఅండ్‌ఆర్డర్ మల్లారెడ్డి, ఏఆర్ అడిషనల్ డీసీపీలు రామ్‌చందర్‌రావు, సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, ప్రసన్నకుమార్, సీఐలు కృష్ణారెడ్డి, రవికుమార్, భానుప్రకాష్, చేరాలు, రామకృష్ణ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు ఆటల్లో రాణించాలి



కబడ్డీలో తలబడుతున్న బాలికలు

వర్గల్(గజ్వేల్): చదువుతో పాటు ఆటలకు ప్రాధాన్యమిస్తూ విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి సాధించాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ ఆకాంక్షించారు. స్థానిక పూలే బాలికల గురుకులంలో గురువారం ఉమ్మడి జిల్లాస్థాయి అండర్–17 బాలికల ఆటల పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాలికలు ఆటల్లో తమ ప్రతిభ చాటుకోవాలని పిలుపునిచ్చారు. పోటీలకు ఉమ్మడి జిల్లాలోని 16 పూలే గురుకులాల నుంచి 620 మంది బాలికలు పాల్గొన్నారు. మొదటి రోజు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు జరిగాయి. వాటితో పాటు ఈనెల 23 వరకు అథ్లెటిక్స్, క్యారమ్స్, చెస్, టెన్నికాయిట్ తదితర ఆటల పోటీలు జరగనున్నాయి. కార్యక్రమంలో ఆర్సీఓ ప్రభాకర్, ఎంఈఓ సునీత, ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు, వీపీ గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా పండుగలు జరుపుకోవాలి

ఇరువర్గాలు సహకరించాలి: ఏఎస్పీ అశోక్



ముస్లిం మత పెద్దలతో ఏఎస్పీ అశోక్

సంగారెడ్డి మున్సిపాలిటీ: అన్నివర్గాల వారు శాంతియుతంగా పండుగలు జరుపుకోవాలని ఏఎస్పీ అశోక్ అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ముస్లిం మత పెద్దలతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు, అలాగే 28న మిలాద్–ఉన్–నబీ పండుగ నేపథ్యంలో నిర్వహించే ర్యాలీలను అక్టోబర్ ఒకటో తేదీకి వాయిదా వేయాలని కోరారు. మత సాంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించుకోవాలని సూచించారు. ఎలాంటి అల్లర్లు, మత విద్వేషాలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పండుగలను జరుపుకోవాలని, అందుకు ఇరు మతస్తులు పోలీసులకు సహకరించాలని కోరారు. కాగా, ఏఎస్పీ సూచన మేరకు అక్టోబర్ ఒకటో తేదీకి మిలాద్– ఉన్– నబీ ర్యాలీ వాయిదా వేస్తున్నామని ముస్లిం మతపెద్దలు ప్రకటించారు. ఈ సమావేశంలో డీఎస్పీ జె.రమేష్ కుమార్, సంగారెడ్డి పట్టణ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శివలింగం ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

అల్లాదుర్గం ఎంపీపీని అరెస్టు చేయాలి

టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంగాచారి, అరుణ్‌కుమార్

గజ్వేల్‌రూరల్: అల్లాదుర్గం సాక్షి విలేకరి వీరేందర్‌పై ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, భౌతికదాడి చేసిన ఎంపీపీని వెంటనే అరెస్టు చేయాలని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు రంగాచారి, ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం గజ్వేల్‌లో విలేకరులతో వారు మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను వెలికితీసే జర్నలిస్టుని అధికారమదంతో దాడికి పాల్పడటం హేయమైన చర్య అని పేర్కొన్నారు. అందిన సమాచారాన్ని బట్టి వార్తలు రాస్తే దుర్భాషలాడి దాడికి పాల్పడటంపై మండిపడ్డారు. వార్తలో తప్పుంటే ఖండించాల్సిందిపోయి భౌతికదాడులకు దిగడం సరైంది కాదన్నారు. ఎంపీపీ అనిల్‌కుమార్ రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని, పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో టీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షులు జగన్, కోశాధికారి కృష్ణ, సీనియర్ జర్నలిస్టులు జమీల్, మధు, ఇక్బాల్, నాగ వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

జర్నలిస్టు వేణు కుటుంబానికి అండగా ఉంటాం

టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్‌అలీ



ఆర్థికసాయం అందజేస్తున్న విరాహత్‌అలీ తదితరులు

గజ్వేల్‌రూరల్: సమస్యలనేవి సహజమేనని, మనోధైర్యంతో వాటిని పరిష్కరించుకోవాలే తప ఆత్మహత్యలు మార్గం కారాదని టీయూడబ్ల్యూజే(తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. విరాహత్‌అలీ అన్నారు. గజ్వేల్ పట్టణంలో ఇటీవల అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యకు పాల్పడిన జర్నలిస్టు వేణుమాధవ్ కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా గజ్వేల్ ప్రెస్‌క్లబ్, నియోజకవర్గ జర్నలిస్టుల సహకారంతో రూ.లక్షా 9వేల ఆర్థికసాయాన్ని వేణుమాధవ్ భార్యకు అందజేశారు. అనంతరం విరాహత్‌అలీ మాట్లాడుతూ వేణు కుటుంబానికి తమ సంఘం అండగా ఉండి చేయూతనిస్తుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు కె. రంగాచారి, ఉపాధ్యక్షుడు జగదీశ్వర్, సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రతిభ చాటాలి

ఉమ్మడి మెదక్ జిల్లా అర్‌సీఓ ప్రభాకర్



మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న క్రీడాకారులు

దౌల్తాబాద్ (దుబ్బాక): క్రీడాకారులు జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయిలోనూ రాణించాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఆర్‌సీఓ ప్రభాకర్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని లింగరాజుపల్లి వద్ద గల ఎంజేపీ గురుకుల బాలుర పాఠశాలలో గురువారం అండర్–17 క్రీడా పోటీలను ప్రిన్సిపాల్ శోభారాణితో కలిసి అట్టహాసంగా ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 13 పాఠశాలల నుంచి 450 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మొదటి రోజు వాలీబాల్, కబడ్డీ, క్యారమ్స్, షార్ట్‌పుట్ తదితర క్రీడలు నిర్వహించినట్లు పీడీలు వెంకట్‌రెడ్డి, రాజన్న తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కనకరాజు, ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్, పీఈటీలు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌లో అంతర పంటగా వరి



ఆయిల్‌పామ్ తోటలో వరి పంట

చిన్నకోడూరు (సిద్దిపేట): మండలంలోని గోనెపల్లికి చెందిన ఓ రైతు ఆయిల్‌పామ్‌లో వరిని అంతర పంటగా సాగు చేశాడు. ఆయిల్ పామ్ సాగులో కూరగాయలు, మొక్కజొన్న, పొద్దు తిరుగుడు వంటి పంటలు అంతర పంటలుగా సాగు చేస్తారు. కానీ రైతు ప్రవీణ్‌రెడ్డి వినూత్న ఆలోచనకు పదును పెట్టాడు. ప్రవీణ్‌రెడ్డికి పన్నెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో ఎనిమిది ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేశాడు. అంతర పంటలుగా నువ్వులు సాగు చేశాడు. అయితే గతేడాది అధిక వర్షాలతో ఆయిల్‌పామ్ తోటలో నీరు చేరడంతో 20 రోజుల పాటు మొక్కలు నీట మునిగాయి. మొక్క చుట్టూ ఎత్తుగా మట్టిని కట్టలాగా కట్టడం వల్ల మొక్కకు ఎటువంటి నష్టం జరగలేదు. దీంతో ఆయనకు ఆయిల్‌పామ్ తోటలో వరిని అంతరపంటగా సాగు చేయాలనే ఆలోచన వచ్చింది. మొక్క చుట్టూ మీటరు వరకు భూమిని వదిలిదున్నాడు. నాటు తర్వాత 15 రోజుల పాటు నీరు పెట్టాడు. మూడు రోజులకోసారి వరికి నీటిని అందిస్తున్నాడు.